ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్

- పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్
- తుమ్మలపాలెంలో జలజీవన్ మిషన్ పనుల పరిశీలన


తుమ్మలపాలెంలో ఫిల్టర్ బెడ్‌లను పరిశీలిస్తున్న రాజశేఖర్, అధికారులు

తుమ్మలపాలెం (ప్రత్తిపాడు): ప్రతి ఇంటికీ వెంటనే ట్యాప్ కనెక్షన్ ఇవ్వాలని పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి. రాజశేఖర్ ఆదేశించారు. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని కొండజాగర్లమూడిలో జలజీవన్ మిషన్ కింద రూ. 37 లక్షలతో మంచినీటి ట్యాంకుతో పాటు పైప్‌లైన్, మైక్రోవాటర్ ఫిల్టర్ నిర్మాణాన్ని చేపట్టారు. వీటిని పరిశీలించేందుకు ఈనెల 6న కేంద్రం నుంచి మినిస్ట్రీ ఆఫ్ డ్రింకింగ్ వాటర్ అండ్ శానిటేషన్ సెక్రటరీ వినీ మహాజన్ రానున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ గ్రామంలో పర్యటించారు. జలజీవన్ మిషన్ ద్వారా చేపట్టిన ఓవర్‌హెడ్ ట్యాంకుతో పాటు ఫిల్టర్ బెడ్లు తదితరాల్ని పరిశీలించారు. గ్రామంలో నీటి కుళాయిలు ఎన్ని? ఎన్నిరోజులకోసారి నీటిని సరఫరా చేస్తున్నారు? ప్రస్తుత తాగునీటి పరిస్థితి ఏమిటి? ఫిల్టర్‌బెడ్‌ల పనితీరు, గ్రామ జనాభా తదితర పూర్తి వివరాల్ని స్థానిక అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులకు గతంలో తాగునీరు అందని పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం ఆ సమస్యను పరిష్కరించేందుకు తుమ్మలపాలెం మంచినీటి ట్యాంకు నుంచి నేరుగా కొండజాగర్లమూడికి పైప్‌లైన్ నిర్మించి, ఇక్కడి ట్యాంక్ ద్వారా ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించనున్నట్లు చీఫ్ ఇంజినీర్ గాయత్రీదేవి రాజశేఖర్‌కు వివరించారు. గ్రామంలో కుళాయి కనెక్షన్ లేని గృహాల్ని గుర్తించి వారికి రెండు రోజుల్లో ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి శివాజీని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఆర్. వి.కృష్ణారెడ్డి, ఎస్‌డబ్ల్యూఎస్‌ఎం ప్రాజెక్టు డైరెక్టర్ హరేరామ్ నాయక్, ఎస్ఈ ఆర్ సురేష్, డీపీవో ఆర్. కేశవరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్‌బాబు, జెడ్పీ సీఈవో జె.మోహన్‌రావు, ఎంపీడీవో శ్రీరమ్య, ఏపీఎం సురేష్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఏపీఎల్ ప్రసాద్, ఏఈ వినీల్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

చట్టాల గురించి తెలుసుకోవాలి

తెనాలి రూరల్: చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని పారా లీగల్ వలంటీర్ యర్రంశెట్టి అనిల్ కుమార్ పేర్కొన్నారు. తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, పదకొండవ అదనపు జిల్లా న్యాయమూర్తి జి. మాలతి ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం తెనాలిలోని పెదరావూరు గ్రామంలో బాలా కార్మిక వ్యవస్థ నిషేధిత, నియంత్రణ చట్టంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. 14 ఏళ్ల లోపు పిల్లలను పనుల్లో చేర్చడం, చేర్పించుకోవ్వడం నేరమన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం ఎలా పొందవచ్చో తెలియజేశారు. గ్రామ సర్పంచ్ కాకి రమాదేవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

4న ఏరువాక పౌర్ణమి పూజలు

వల్లభాపురం(కొల్లిపర): వల్లభాపురం గ్రామంలోని వినాయకస్వామి దేవాలయంలో ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఏరువాక పౌర్ణమి పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త అచ్యుత ఇందుశేఖర్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. మరో 10 రోజుల్లో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభిస్తారన్నారు. రైతాంగానికి మేలు జరగాలని, అధిక దిగుబడులు సాధించాలని ఏరువాక పౌర్ణమి పూజలు నిర్వహించనున్నట్లు వివరించారు. రైతులు పూజల్లో పాల్గొని జయప్రదం చేసి, తీర్థప్రసాదాలు అందుకోవాలని ఆలయ ధర్మకర్త అచ్యుత ఇందుశేఖర్ కోరారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

తెనాలి అర్బన్: పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటల నుంచే విద్యార్థులు పరీక్ష కేంద్రం వద్దకు చేరుకున్నారు. మొదటి రోజు తెలుగు పరీక్షకు.. తెనాలి డివిజన్ పరిధిలోని 10 సెంటర్లలో పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు డిప్యూటీ డీఈఓ నిర్మల తెలిపారు.

లిడ్‌క్యాప్ నిర్వహణ పటిష్టం చేయాలి



నెహ్రూనగర్: చర్మకారుల అభివృద్ధే ధ్యేయంగా ఏర్పాటు చేసిన లిడ్‌క్యాప్ నిర్వహణను ప్రభుత్వం పటిష్టం చేయాలని నవ్య మాదిగ చర్మకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేజేండ్ల సుబ్బారావు కోరారు. నగరంలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లిడ్‌క్యాప్ నిధుల నిర్వహణలో నిర్లక్ష్యవైఖరి కనబరుస్తున్నారని, చర్మకారుల నైపుణ్యాన్ని అభివృద్ధికి గ్రాంటును సక్రమంగా వినియోగించడం లేదని ఆరోపించారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన అధికారిని నియమించి, సమర్థంగా నిర్వహించాలని ఆయన కోరారు.

వైఎస్సార్ బీమా సాయం పంపిణీ



నెహ్రూనగర్: బొంగరాలబీడు 1వ లైనులో నివసిస్తున్న ఆగిపోగు పాల్ శుక్రవారం మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా పథకం కింద రూ.10వేలను 55వ డివిజన్ కార్పొరేటర్ పాపతోటి అంబేడ్కర్ అందజేశారు. మిగిలిన సొమ్ము సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ సెక్రటరీల్ని ఆయన కోరారు.

బాల కార్మికులతో పని చేయిస్తున్న యజమానిపై కేసు నమోదు

పట్నంబజారు: దుకాణంలో బాల కార్మికులతో పని చేయిస్తున్న యజమానిపై కేసు నమోదైంది. లాలాపేట పరిధిలోని వెంకటరమణ పాలిమర్స్‌లో ఇద్దరు బాల కార్మికులు పని చేస్తుండటం గుర్తించి చైల్డ్ వెల్ఫేర్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. యజమాని కోదాటి ఉదయ్‌కుమార్‌పై చైల్డ్ వెల్ఫేర్ అధికారుల ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ప్రత్తిపాడు డివిజన్

90109 57733 (ప్రత్తిపాడు)

90109 62225 (పొన్నూరు)

Office mail : sakshigntadvt@gmail.com

మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించే సీఎం జగన్

- 4న 'మేనిఫెస్టో అంటే జగన్' అనే అంశంపై చర్చ
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ వెల్లడి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డొక్కా మాణిక్యవరప్రసాద్ తదితరులు

పట్నంబజారు: హిందువులకు భగవద్గీత.. ముస్లింలకు ఖురాన్.. క్రైస్తవులకు బైబిల్ ఎంత పవిత్రమో.. మేనిఫెస్టోను సైతం పవిత్ర గ్రంథంలా భావిస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి స్పష్టంగా చెప్పడంతో పాటు పాటు, ప్రతి హామీని నెరవేర్చిన ఘనత ఆయనకే దక్కుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ చెప్పారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ రీజనల్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుంటూరు నగరంలోని హిందూ కళాశాల సెమినార్ హాలులో 'మేనిఫెస్టో అంటే ' అనే అంశంపై ఈ నెల 4న చర్చను జిల్లా పార్టీ నేతృత్వంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుదీర్ఘ పాదయాత్రలో పేదల కష్టాలు తెలుసుకుని.. అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన ప్రతి హామీకి కట్టుబడి పని చేయడంతో పాటు , నవరత్నాల్ని ప్రతి ఒక్కరి దరిచేర్చిన ఘనత సీఎం జగన్‌దేనని చెప్పారు. 14 ఏళ్ల పాటు సీఎం.. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు అధికారం కోసం అబద్ధపు హామీలు ఇచ్చాడే తప్పా.. వచ్చాక అమలు చేసిన పాపాన పోలేదని విమర్శించారు. 2014 ఎన్నికల్లో సుమారు 600పైగా హామీలతో కూడిన మేనిఫెస్టోను ప్రకటించి, ఆఖరికి వెబ్‌సైట్‌లో కూడా లేకుండా చేసిన నీఛ చరిత్ర చంద్రబాబుదని మండిపడ్డారు. పేద,బడుగు, బలహీన, మైనారిటీ, ఎస్సీఎస్టీ వర్గాలకు ఇచ్చిన ప్రతి మాటను చెప్పాడంటే.. చేస్తాడంతే.. అని సీఎం వైఎస్ జగన్ నిరూపించుకున్నారు. మహానాడు ద్వారా చంద్రబాబు అండ్ కో మరో మారు రాజకీయ డ్రామాలకు తెరదీశారని పేర్కొన్నారు. ఈ నెల 4వ తేదీన జరిగే 'మేనిఫెస్టో అంటే జగన్' కార్యక్రమానికి ఆర్థిక రంగ విశ్లేషకులు డి. పాపారావు, ప్రెస్ అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావుతో పార్టీ ప్రజా ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్పొరేటర్లు, పార్టీ నేతలు పెద్దఎత్తున హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నేతలు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మేరిగ విజయలక్ష్మి, గనిక ఝాన్సీ, సీడీ భగవాన్, డాక్టర్ వై.షేక్, మాదా రాధాకృష్ణమూర్తి, రామకృష్ణారెడ్డి, భిక్కునాయక్ పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు


పూర్ణాహుతిలో పాల్గొన్న భక్తులు

పాత గుంటూరు: కొత్తపేటలోని శ్రీ జగన్నాథస్వామి దేవస్థానంలో శ్రీ రుక్మిణీ సత్య భామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామిని తులసి మాలతో అలంకరించారు. ఉదయం వసంతోత్సవం, చక్రస్నానం, పూర్ణాహుతి నిర్వహించారు. రాత్రి ధ్వజావరోహణ, బలిహరణ నిర్వహించారు. కార్యక్రమాల్ని ఆలయ చైర్మన్ పిచ్చుల జయప్రకాష్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్, ఈవో డి. శ్రీనివాసరావు, అర్చకులు ఆయోధ్య అయ్యప్ప పర్యవేక్షించారు. ధర్మకర్తల మండలి సభ్యులు విశాలాక్షి, వెంకట జ్యోతి, నరేష్ కుమార్, రామకోటేశ్వరరావు, వెంకటరత్నం, శ్రీనివాసులు, అనిత, శివకుమారి పాల్గొన్నారు.

కన్నుల పండువగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు


లక్ష మల్లెల పూజలో పాల్గొన్న భక్తులు

పాత గుంటూరు: లాలాపేటలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం నిత్య హోమం, బలిహరణ, లక్ష మల్లెల పూజ నిర్వహించారు. రాత్రికి సుదర్శన వెంకటేశ్వర అష్టాక్షరి మంత్ర హోమం, స్వామికి హంస వాహనంపై గ్రామోత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమాల్ని దేవస్థానం చైర్మన్ పిచ్చుల జయప్రకాష్‌రెడ్డి, దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్, ఈవో డి. శ్రీనివాసరావు, అర్చకులు ప్రసాద్, మురళీ చంద్ర కుమార్, శ్రీనివాసాచార్యులు పర్యవేక్షించారు. ధరకర్తల మండలి సభ్యులు విశాలాక్షి, వెంకట జ్యోతి, నరేష్ కుమార్, రామకోటేశ్వరరావు, వెంకటరత్నం, శ్రీనివాసులు, అనిత, శివకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ


ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ లక్ష్మీసుధ, ప్రియాంక

మున్నంగి(కొల్లిపర): ప్రతి ఒక్కరూ ఇళ్లల్లో మురుగు నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకుంటూ, నిత్యం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల దోమలు, ఈగలు అభివృద్ధి చెందకుండా అరికట్టవచ్చని మండల వైద్యాధికారి డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ, డాక్టర్ వేముల ప్రియాంక సూచించారు. డ్రైడేలో భాగంగా శుక్రవారం మున్నంగి గ్రామంలో నీటి నిల్వల్ని పరిశీలించి, దోమల నిర్మూలనకు ఎబేట్ మందును సిబ్బందితో పిచికారీ చేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ మురుగు నీరు నిల్వలు ఉండటం వల్ల లార్వాలు అభివృద్ధి చెంది దోమలు అధికమవుతాయిఅని తెలిపారు. కార్యక్రమంలో తెనాలి ఇన్‌చార్జి మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి , సమాజ ఆరోగ్య అధికారిణి దాసర స్వరూపరాణి, ఆరోగ్య విస్తరణాధికారి అందెబాల చంద్రమౌళి, వంగర బుజ్జిబాబు, తమ్మ నాగరాజు, వైద్య శాఖ సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేత

తెనాలి: పట్టణానికి చెందిన నటరాజ్ జ్యూయలర్ మార్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం చిరు వ్యాపారులకు తోపుడు బండ్లను పంపిణీ చేశారు. స్థానిక చినరావూరు పార్కు వద్ద ఏర్పాటైన కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, స్థానిక 15వ వార్డు కౌన్సిలరు గుంటూరు కోటేశ్వరరావుతో కలిసి మూడు తోపుడుబండ్లు, ఒక బల్ల రిక్షాను అందజేశారు. జ్యూయలరీ సంస్థ యజమాని కొత్తమాసు కుమార్ ఈ వితరణ చేపట్టారు. తండ్రి కొత్తమాసు తులసీదాస్ ఆశయాల ప్రకారం కుమారుడైన కుమార్ పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఎమ్మెల్యే శివకుమార్ అన్నారు. చిరువ్యాపారుల జీవనోపాధికి తోపుడుబండ్లు, బల్ల రిక్షా ఉపయోగపడుతాయని మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు అన్నారు. దాత కొత్తమాసు కుమార్ మాట్లాడుతూ చినరావూరు పరిసర ప్రాంత ప్రజలు, విద్యార్థులకు ఉపయోగపడేలా పార్కు వద్ద సొంత ఖర్చులతో బస్‌షెల్టర్‌ను నిర్మిస్తానని, మూడురోజుల్లో శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు.

అండర్-19 క్రికెట్ టోర్నమెంటు ప్రారంభం




తెనాలి: తెనాలిలో షేక్ ఖాశింబీ మెమోరియల్ జిల్లాస్థాయి అండర్-19 క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం స్థానిక తాలూకా జూనియర్ కాలేజీ క్రీడా మైదానంలో ప్రారంభమైంది. షేక్ మాలిక్ ఆధ్వర్యంలో ది ఏషియన్ యూత్ స్పోర్ట్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న ఈ టోర్నమెంటులో వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నారు. ముఖ్య అతిథులుగా డాక్టర్ కొత్త రవికిరణ్, ది అమరావతి కో-ఆపరేటివ్ బ్యాంక్ జిల్లా సీఈవో తన్నీరు శ్రీనివాసరావు, చైతన్య జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ నన్నపనేని సునీల్‌కుమార్, యువ క్రికెట్ అకాడమీ డైరెక్టర్ హరిదాసు గౌరీశంకర్, మామిడిబత్తుల సుబ్రహ్మణ్యం, డాక్టర్ బండారు రవికాంత్, బండారు మధుసూదన్, షేక్ బాబర్ హాజరయ్యారు. తొలుత షేక్ ఖాశింబీ మూడో వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. కుటుంబసభ్యులు షేక్ రిజ్వాన-సాదిక్ బాషా, షేక్ బీబీ-రెహ్మాన్, షేక్ కమర్‌జహా-రాజిక్, షేక్ మానస, మీరాబీ పాల్గొన్నారు.

వేడుకగా శివాజీ పట్టాభిషేక శోభాయాత్ర



తెనాలి: శివాజీ మహారాజ్ ఛత్రపతిగా పట్టాభిషిక్తుడైన జేష్ఠ శుద్ధ త్రయోదశిని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలో శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ఛత్రపతి శివాజీ స్మారక సమితి ఆధ్వర్యంలో సుల్తానాబాద్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి శివాజీచౌక్ వరకు శోభాయాత్ర వేడుకగా జరిగింది. బీజేపీ, విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్ తదితర విభాగాల ప్రతినిధులు, యువతీయువకులు, మహిళలు కాషాయ జెండాలు, తలపాగాలు ధరించి, బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. దారిపొడవునా నృత్యాలు చేశారు. కర్రసాము చేస్తూ జైరామ్ శ్రీరామ్ అంటూ నినదించారు. ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూజలు చేశారు. బహిరంగ సభలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ, జిల్లా కార్యదర్శి సత్య కుమార్, కాకతీయ బ్యాంక్ చైర్మన్ డీఎల్ కాంతారావు, జీడీసీసీ బ్యాంక్ విశ్రాంత సీఈవో డి.సుబ్రహ్మణ్యేశ్వరరావు మాట్లాడారు. శివాజీ స్ఫూర్తిగా యువతీ యువకులు జాతీయ స్ఫూర్తిని పొందాలని, ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

ఏపీపీ బాధ్యతలు స్వీకారం



తెనాలిరూరల్: తెనాలి రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా అల్లంశెట్టి రాఘవేంద్ర పవన్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇనచార్జి ఏపీపీగా ఉన్న సీనియర్ ఏపీపీ పరిశపోగు సునీల్‌కుమార్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా దర్శి కోర్టు, చిలకలూరిపేట కోర్టుల్లో పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి స్వామిని దర్శించుకున్న ప్రముఖులు


స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు పిన్నెల్లి, గోపిరెడ్డి, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి తదితరులు

పెదకాకాని: విశాఖ శ్రీ శారద పీఠాధిపతులు శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామిని శుక్రవారం శివాలయంలో పలువురు ప్రముఖులు దర్శించుకుని ఆశీస్సులు అందుకున్నారు. ఆలయంలో ఈనెల 1వ తేదీ నుండి మూడు రోజుల పాటు నిర్వహించనున్న మహా కుంభాభిషేక మహోత్సవాన్ని శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి, శ్రీ స్వాత్మానందేంద్ర మహాస్వామి దివ్య హస్తాలతో నిర్వహిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య దంపతులు, మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు(విజయవాడ సెంట్రల్), వెల్లంపల్లి శ్రీనివాసరావు(విజయవాడ), పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(మాచర్ల), డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి(నర్సరావుపేట), ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి తదితరుల శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి స్వామిని దర్శించుకుని దివ్య ఆశీస్సులు అందుకున్నారు.

సీఎం సభకు భారీగా తరలిన ప్రజలు


చల్లావారిపాలెం నుంచి సభకు వెళుతున్న ప్రజలు

గుంటూరు రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా పథకం కార్యక్రమానికి గుంటూరు రూరల్ మండలంలో పలు గ్రామాల నుంచి ప్రజలు శుక్రవారం స్వచ్ఛందంగా తరలివెళ్లారు. జొన్నలగడ్డ, గోర్లవారిపాలెం, మల్లవరం, తోకావారిపాలెం, దాసుపాలెం, చిన్నపలకలూరు, పెద్దపలకలూరు, తురకపాలెం, నల్లపాడు, చల్లావారిపాలెం, వెంగళాయపాలెం, ఓబులునాయుడుపాలెం, అంకిరెడ్డిపాలెం, పొత్తూరు, నాయుడుపేట, చౌడవరం, లాలుపురం, బుడంపాడు, ఏటుకూరు, రెడ్డిపాలెం, గోరంట్ల, స్వర్ణభారతీనగర్, అడవితక్కెళ్లపాడు, నగరాలు తదితర ప్రాంతాల నుంచి ప్రజలు కార్యక్రమానికి భారీ సంఖ్యలో వెళ్లారు. ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు జెండాల్ని ఊపి వాహనాల్ని ప్రారంభించారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

ఎమ్మెల్యే ముస్తఫా


వలంటీర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కొనియాడారు. నియోజకవర్గంలోని 15వ డివిజన్ పరిధిలో వలంటీర్లకు శుక్రవారం షమ ఫంక్షన్ హాలులో అభినందన కార్యక్రమం నిర్వహించారు. సేవ పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వలంటీర్ వ్యవస్థ ఇతర రాష్ట్రాలు సైతం ఆదర్శంగా తీసుకునేలా సేవలందిస్తోందనిన తెలిపారు. అర్హులైన ప్రతి పేదవారికీ సంక్షేమ పథకాలు అందజేస్తూ వలంటీర్లు ముందుకు సాగడం సంతోషదాయకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ మహిళా నేత నూరి ఫాతిమా, కార్పొరేటర్ రామనబోయిన అజయ్ యాదవ్, నాగేశ్వరరావు, గోపి, అంజిరెడ్డి, హనుమాయమ్మ, రాంబాబు, హనుమంతరావు, చెంచయ్య, నన్నే, నరసింహారావు, మస్తాన్‌వలి, సుభాని పాల్గొన్నారు.

ఠంచన్‌గా దరి చేరిన పింఛన్


జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విజయలక్ష్మికి పింఛన్ అందజేస్తున్న వెల్ఫేర్ రమ్యకృష్ణ

తెనాలి అర్బన్: సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం తెనాలిలో శుక్రవారం కొనసాగింది. వృద్ధాప్య, వితంతువు, వికలాంగు పింఛన్లతో పాటు హెల్త్ పింఛన్లను సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ, వలంటీర్లు పంపిణీ చేశారు. ఐతా నగర్‌కు చెందిన యంద్రపాటి స్వాతి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ ఇంటిలోనే ఉంటోంది. ఆమెకు వెల్ఫేర్ ఆనందరావు, వలంటీర్ మంద్రు మౌనిక హెల్త్ పింఛన్ రూ.5 వేలు అందజేశారు. అలాగే బుర్రిపాలెం రోడ్డులో నివసించే తాడివాక విజయలక్ష్మి కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ఆమె గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. డయాలసిస్ రోగులకు అందించే రూ.10వేల పింఛన్‌ను వెల్ఫేర్ సెక్రటరీ సీహెచ్.రమ్యకృష్ణ గుంటూరు వెళ్లి అందజేశారు. అలాగే ఐతానగర్‌కు చెందిన పాముల సౌభాగ్యంకు వలంటీర్ పిల్లి నరసింహారావు వృద్ధాప్య పింఛన్‌ను అందజేశారు.

మలేరియా వ్యాధిపై అవగాహన ఉండాలి


ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ దేవిక వాణి, సిబ్బంది

తెనాలి అర్బన్: ఆడ అనాఫిలిస్ దోమ కాటు వల్ల మలేరియా వ్యాధి సోకుతుందని మారీసు పేటలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ వాకాడ దేవికావాణి పేర్కొన్నారు. మలేరియా మాసోత్సవాల సందర్భంగా మారీసుపేటలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా ఒకరి నుంచి మరొకరికి సోకే అవకాశం ఉందన్నారు. దోమకాటుకు గురికాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా జ్వరంతో బాధపడుతుంటే వెంటనే సమీపంలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్, ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందాలని సూచించారు. తెనాలి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని కోరారు. కార్యక్రమంలో మలేరియా సిబ్బంది డి.మల్లేశ్వరరావు, తిరువీధుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ రెవెన్యూ అధికారి జయకర్ బదిలీ



తెనాలి అర్బన్: తెనాలి మున్సిపల్ రెవెన్యూ అధికారి కె.విల్సన్ జయకర్ బదిలీ అయ్యారు. ఈ మేరకు డీఎంఏ ఉత్తర్వులు జారీ చేశారు. రెవెన్యూ అధికారిగా పనిచేస్తూ సుమారు ఏడాది నుంచి సెలవులో ఉన్న ఆయన్ను పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మున్సిపల్ కార్యాలయ మేనేజర్‌గా బదిలీ చేశారు. భీమవరం మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారిగా పనిచేస్తున్న డి.సోమశేఖర్ యాదవ్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. వీరు రెండు రోజుల్లో విధుల్లో చేరే అవకాశం ఉంది.

